సాక్షి నిజామాబాద్

బుధవారం । 22 । జనవరి । 2025

7



అందని జీతాలు

ఉపాధిహామీ విభాగంలో పని చేస్తున్న చిరుద్యోగులకు వేతనాలు కరువయ్యాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- 8లో ▸



ఆర్టీసీకి పండుగ

ఆర్టీసీకి పండుగను తెచ్చింది సంక్రాంతి పర్వదినం. సంక్రాంతి సందర్భంగా అదనపు బస్సులు నడిపిన ఆర్టీసీకి లాభాలు వచ్చాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
30.1 /8.8

ఉదయం మంచు దట్టంగా కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ఆశల సమస్యలను పరిష్కరించాలి



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆశ కార్యకర్తలు కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో మంగళవారం ఆశ కార్యకర్తలు 10 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. తమకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశలకు నెలకు రూ.18వేల వేతనం ఇవ్వాలని, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సీఐటీయూ నాయకులు రమేష్ బాబు, నాయకులు సుకన్య, రేణుక, బాలమణి, రేణుక, రమ, రాధా, విజయ, తనుజ, వనిత, రేష్మ, లలిత, బాలమణి, భాగ్య, స్వప్న, లావణ్య, కవిత, లక్ష్మి, సాహిర, రేవతి, చందన, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఈ-ఔషధిపై శిక్షణ



నిజామాబాద్‌నాగారం: నగరంలో మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పబ్లిక్ హెల్త్, వైద్య విధాన పరిషత్ - మెడికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, నర్సింగ్ ఆఫీసర్లకు ఈ–ఔషధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జీజీహెచ్‌లో మందుల పంపిణీ, మందుల సరఫరా, ఈ ఔషధీ నిర్వహణ గురించి వివరించారు. అలాగే ముగ్గురు సభ్యులతో కూడిన బృందం ఈ ఔషధీని తనిఖీ చేయడం, మందులను తిరిగి సరఫరా చేయడం వంటివి చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆస్పత్రుల్లో ఉన్నటువంటి సమస్యలను తెలుసుకుని, తగిన సలహాలు, సూచనలు చేశారు. రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లాకి ఏ సమయంలోనైనా విచ్చేసి ప్రభుత్వ ఆస్పత్రులను తనిఖీ చేయనుందని, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, రాథోడ్, అంజనా, రాజు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రలో జర్మనీ దంపతులు



బాల్కొండ: జర్మనీ దేశానికి చెందిన ఓ జంట ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈక్రమంలో మంగళవారం వారు ముప్కాల్ మండల కేంద్రం శివారుకు చేరుకోగా స్థానిక విద్యార్థులతో ముచ్చటించారు. ప్రపంచ దేశాల్లో సైకిల్ యాత్ర చేపట్టాలనే కాంక్షతో భారతదేశంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు 1265 కిలోమీటర్ల మేరా సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు వారు తెలిపారు. విద్యార్థులతో పలు అంశాలపై మాట్లాడుతూ ఆనందంగా గడిపారు.

గ్రంథాలయాలకు భవన నిర్మాణాలు



నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని గ్రంథాలయాలకు నూతన భవనాలు నిర్మించేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రంథాలయ చైర్మన్ అంత రెడ్డి రాజారెడ్డి సమావేశ తీర్మానాలను వెల్లడించారు. రెంజల్, నవీపేట, ఆర్మూర్‌లలో నూతన భవన నిర్మాణాలకు ఆమోదం తెలిపారు. మూతపడిన గ్రామీణ గ్రంథాలయాలను తిరిగి ప్రారంభించాలని, సిరికొండ, పోచంపాడు, నందిపేట గ్రంథాలయాలకు నూతన భవన నిర్మాణా కోసం స్థల సేకరణ చేపట్టాలని నిర్ణయించారు.

మాక్లూర్ మండలం అమ్రాద్‌లో ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డిని ప్రశ్నిస్తున్న మహిళలు



డిచ్‌పల్లి మండలం నడిపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



గ్రామ సభలు గరంగరం

- నిరసనలు.. నిలదీతలు
- సంక్షేమ పథకాల జాబితాలో పేర్ల గల్లంతుపై దరఖాస్తుదారుల ఆందోళన
- ఎన్నికల హామీ నెరవేర్చలేదని ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డితో మహిళల వాగ్వాదం
- గాదెపల్లిలో సభ బహిష్కరణ

నిజామాబాద్‌అర్బన్: నాలుగు పథకాలకు సంబంధించి జిల్లాలో నిర్వహించిన వార్డు, గ్రామ సభలు మంగళవారం మొదటి రోజు నిరసనలు, నిలదీతల మధ్య జరిగాయి. వివిధ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకున్న వారు తమ పేర్లు నివేదికలో ఎందుకు లేవని అధికారులకు ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ సభలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెండు విడతలుగా జరిగాయి. సభల నిర్వహణను క్లస్టర్‌గా విభజించి ప్రత్యేక అధికారులను నియమించారు. మొదటి రోజు 160 గ్రామ పంచాయతీలు, 40 మున్సిపల్ వార్డుల్లో మొత్తం 200 ప్రాంతాల్లో సభలు జరిగాయి. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఇందల్వాయి మండలం, అదనపు కలెక్టర్ అంకిత్ నవీపేట మండలంలో, ఇతర అధికారులు వివిధ మండలాల్లో సభలకు హాజరయ్యారు. ఇందల్వాయి మండలం లోలం గ్రామ సభలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు. డిచ్‌పల్లి మండలం దూస్‌గాం గ్రామ సభలో జెడ్పీ సీఈవో సాయన్న, రాంపూర్ గ్రామ సభలో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

నిలదీతలు..

నందిపేట మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఎదుట మహిళలు నిరసన తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతి గ్రామానికి పది ఇళ్లు కట్టిస్తానని హామీ ఇచ్చి నెరవేర్చడం లేదని నిలదీశారు. వార్డు, గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ , పేర్ల నమోదు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు అర్హుల ఎంపికకు ప్రజాపాలనలో అధికారులు స్వీకరించిన దరఖాస్తుల ప్రకారం పరిశీలన కొనసాగుతోంది. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సభల్లో ఆయా పథకాలకు దరఖాస్తులు చేసుకున్నవారి వివరాలను సభలో అధికారులు ప్రకటించారు. అయితే చాలా మంది పేర్లు అధికారుల నివేదికలో లేవు. దీంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా కూడా తమ పేర్లు ఎందుకు నమోదు చేయలేదని ప్రజలు చాలా చోట్ల అధికారులను నిలదీశారు. రేషన్‌కార్డుల జారీకి సంబంధించి పేర్ల నమోదు ప్రక్రియలో చాలా చోట్ల దరఖాస్తు దారుల వివరాలు గల్లంతయ్యాయి. కొని చోట్ల ప్రజాపాలన దరఖాస్తులు కూడా అధికారులను లేకపోవడంతో ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉంది. ఇందులో మొదటి రోజు 16 వార్డు సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకుగాను ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశారు. నగరంలోని 21, 41 డివిజన్‌లలో జరిగిన సమావేశంలో బీజేపీ కార్యకర్తలు ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ నాయకుల పేర్లు పెట్టారని ఆరోపించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి, మోపాల్, ధర్పల్లి, నిజామాబాద్ రూరల్, జక్రాన్ పల్లి, సిరికొండ మండలాల్లో సభలు రసాభాసగా కొనసాగాయి. అర్హత ఉన్నప్పటికీ తమ పేర్లు జాబితాలో రాలేదని, ప్రభుత్వ ఉద్యోగులు, పెద్ద వ్యాపారుల పేర్లు మాత్రం లబ్ధిదారుల జాబితాలో ఎలా వస్తాయని పలు గ్రామాల్లో ప్రజలు అధికారులను ప్రశ్నించారు.



నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

■ ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం సభలలో దరఖాస్తుదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బోధన్, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట, రుద్రూర్, వర్ని, కోటగిరి, పోతంగల్, మోస్రా, చందూర్ మండలాల్లోని గ్రామాల్లో ప్రజా పాలన గ్రామ సభలు అసంతృప్తి మధ్య కొనసాగాయి. బోధన్, వర్ని మండలాల్లోని ఐదు గ్రామాల్లో, మోస్రా, చందూర్ మండలాల్లోని ఒక్కొక్క గ్రామంలో, మిగిలిన మండలాల్లో మూడు గ్రామాల చొప్పున గ్రామసభలు జరిగాయి. బోధన్ పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహించిన సభలు సాదాసీదాగా జరిగాయి. రుద్రూర్ మండలంలోని అంబం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు అర్హుల జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. సర్వే చేసి, ఫొటోలు తీసుకున్నారని అధికారులకు మొరపెట్టుకున్నారు.

డొంకేశ్వర్ మండలం గాదేపల్లి గ్రామంలో అర్హులకు సంక్షేమ పథకాలను వర్తింపజేయడం లేదని నిరసిస్తూ గ్రామస్తులు గ్రామసభను బహిష్కరించారు. అనంతరం గ్రామ సెక్రెటరీకి వినతి పత్రం సమర్పించారు. బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలం తాళ్లపల్లిలో గ్రామ సభ నిర్వహించగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించే లబ్ధిదారుల జాబితాలో అర్హులకు స్థానం లభించలేదని పలువురు ఆరోపించారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య కొంత వాగ్వివాదం జరిగింది.

మొదటి రోజు దరఖాస్తులు

20,588

జిల్లాలో మొదటి రోజు గ్రామ, వార్డు సభల్లో అధికారులు 20,588 దరఖాస్తులను స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తులు తీసుకున్నారు. ఇందులో రేషన్‌కార్డుల జారీకి సంబంధించి 13,554, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి 2708, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 4326 దరఖాస్తులు వచ్చాయి.



ఎడపల్లి : కుర్నాపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



నాగాపూర్ శివారులో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ముంపు భూమిలో సాగు చేస్తున్న వరి

ముంపు భూముల్లో సాగు

- ఎస్సారెస్పీ నీటి మట్టం తగ్గడంతో బయట పడిన భూములు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ముంపు భూముల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నీటి మట్టం తగ్గడంతో ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే నాగాపూర్, జలాల్‌పూర్, కోమన్‌పల్లి శివారులో భూములు బయట పడుతున్నాయి. దీంతో భూములు ప్రాజెక్ట్ కోసం కోల్పోయిన రైతులు అందులో వరి పంటను సాగు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం యాసంగి సీజన్‌లో బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం బయల్పడటంతో రైతులు పంటను సాగు చేసుకుంటారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటి వరకు పూర్తి పరిహారం అందలేదు. దీంతో రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. ఇలా భూములు బయట పడగానే పంటలను వేసుకుంటున్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరాలి

- నిర్దేశించిన ప్రకారం వార్డు, గ్రామ సభలు నిర్వహించాలి
- సంక్షేమ పథకాల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం
- మంత్రులతో కలిసి జిల్లా కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్లు, అధికారులు

నిజామాబాద్‌అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ నెల 24 వరకు కొనసాగనున్న వార్డు, గ్రామ సభల నిర్వహణపై మంగళవారం రాత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రామ సభలలో మొదటి రోజు ప్రజలు ప్రస్తావించిన అంశాల గురించి కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని తెలిపారు. జనవరి 26 నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకోని వారి నుంచి అర్జీలు స్వీకరించాలని సూచించారు. గ్రామ సభల అనంతరం ప్రజాపాలన సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని అధికారులతో పేర్కొన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. మొదటి రోజు జిల్లాలో 201 గ్రామాలు, వార్డులలో సభలు జరి గాయని తెలిపారు. లబ్ధిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలని, ఎవరికైనా అభ్యంతరాలుంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- లోలంలో గ్రామసభ పరిశీలన

ఇందల్వాయి: సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. ఇందల్వాయి మండలం లోలం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించినట్లు కలెక్టర్ గుర్తు చేశారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుండా గ్రామ సభ వీటికి ఆమోదం తెలిపింది. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేనివారి నుంచి కూడా అర్జీలు స్వీకరించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని అన్నారు.ఆర్డీవో రాజేంద్రకుమార్, మండల ప్రత్యేక అధికారి వీరాస్వామి, అధికారులు పాల్గొన్నారు.



లోలం గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఎమ్మెల్సీ రేసులో..

- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, మాజీ డీఎస్పీ మదనం గంగాధర్
- బీఆర్ఎస్ అభ్యర్థిత్వం కోరుతున్న రవీందర్‌సింగ్, డాక్టర్ బీఎన్ రావు, రాజారాంయాదవ్
- బీఆర్ఎస్ మద్దతు కోరుతున్న గిరిధర్ గౌడ్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆదిలాబాద్–నిజామాబాద్–కరీంగనర్–మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. అయితే ఇప్పటికే బీజేపీ తన అభ్యర్థులను ప్రకటించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంగారెడ్డి జిల్లాకు చెందిన సి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్క కొమరయ్యలను ప్రకటించింది. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం కోసం పలువురు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మరొక సీనియర్ జర్నలిస్ట్ స్వతంత్రంగా బరిలో ఉంటూనే బీఆర్ఎస్ మద్దతు కోరుతున్నారు.

■ బీఆర్ఎస్ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలిచేందుకు పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. కరీంనగర్‌కు చెందిన మాజీ మేయర్ రవీందర్‌సింగ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గానికి చెందిన రాజారాం యాదవ్ బీఆర్ఎస్ అభ్యర్థిత్వం కోసం లాబీయింగ్ చేస్తున్నారు. మరోవైపు స్వతంత్రంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగిన సంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ మాచర్ల గిరిధర్‌గౌడ్ బీఆర్ఎస్ మద్దతు కోరుతున్నారు.

■ కాంగ్రెస్ పార్టీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలోకి దిగేందుకు కరీంనగర్‌కు చెందిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. నరేందర్‌రెడ్డి గత రెండున్నర నెలలుగా స్వతంత్రంగా ప్రచారం చేసుకుంటున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో విస్తృతంగా తిరుగుతున్నారు. సోషల్ మీడియాలోనూ ప్రచారం చేస్తున్నారు. మరోవైపు పోలీసు శాఖలో డీఎస్పీ ఉద్యోగానికి వీఆర్ఎస్ ఇచ్చి వచ్చిన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన మదనం గంగాధర్ సైతం పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలోకి వచ్చారు. గంగాధర్ రెండు నెలలుగా నాలుగు జిల్లాల్లో తిరుగుతూ స్వతంత్రంగా ప్రచారం చేస్తున్నారు. ఈయన కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

■ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ నుంచి మల్క కొమరయ్యను ప్రకటించారు. కాగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి హడావుడి లేదు. ఈ రెండు పార్టీలు అభ్యర్థులను ప్రకటించే అవకాశం లేదంటున్నారు.

క్లుప్తంగా

భీమ్‌గల్‌ సీఐగా సత్యనారాయణ



మోర్తాడ్‌: భీమ్‌గల్‌ సీఐగా సత్యనారాయణ మంగళవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన నరేష్‌కుమార్‌పై పలు ఆరోపణలు రాగా అతడిని ఐజీ కార్యాలయానికి అటాచ్‌ చేశారు. ఆయన స్థానంలో రామగుండం పోలీసు కమిషనరేట్‌ పరిధిలో సీఐగా పని చేసిన సత్యనారాయణను భీమ్‌గల్‌కు ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

కవల దూడలకు జన్మనిచ్చిన ఆవు



రుద్రూర్‌: కోటగిరి మండలంలోని సుద్దులం గ్రామంలో మంగళవారం ఓ ఆవు కవల దూడలకు జన్మనిచ్చింది. గ్రామంలోని లక్ష్మణ్‌ అనే రైతుకు చెందిన ఆవుకు మంగళవారం రెండు దూడలకు జన్మించాయి. ప్రస్తుతం ఆవు, దూడలు ఆరోగ్యంగా ఉన్నాయి. దీంతో చుట్టు పక్కల ప్రజలు విషయం తెలుసుకుని చూసేందుకు వచ్చారు.

సదస్సును విజయవంతం చేయండి



తెయూ(డిచ్‌పల్లి): హైదరాబాద్‌ సారస్వత పరిషత్‌లో ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'భారత రాజ్యాంగంపై సమీక్ష' అనే అంశంపై నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జాగృతి విద్యార్థి రాష్ట్ర అధ్యక్షులు పసుల చరణ్‌ కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌ వద్ద సదస్సు పోస్టర్లను అధ్యాపకులు కనకయ్య, అబ్దుల్‌ ఖవి, జమీల్‌, నాగరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం వజ్రోత్సవాల్లో భాగంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు సాజన్‌ శెట్టి, సత్యవతి, శ్రీనివాస్‌ గౌడ్‌, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ భరద్వాజ, పులి జైపాల్‌, రాము, రవికాంత్‌, నితిన్‌ పాల్గొన్నారు.

ఆర్టీసీకి పండుగ తెచ్చిన సంక్రాంతి



- ఉమ్మడి జిల్లాలో పండుగ వేళ 568 ప్రత్యేక బస్సుల ఏర్పాటు
- 11 రోజులలో ఆర్టీసీకి రూ.1.73 కోట్ల ఆదాయం

ఖలీల్‌వాడి: ఆర్టీసీకి పండుగ తెచ్చింది సంక్రాంతి పర్వదినం. సంక్రాంతి సందర్భంగా అదనపు బస్సులు నడపిన ఆర్టీసీకి మంచి లాభాలు వచ్చాయి. ఈనెల 9నుంచి 20వరకు సాధారణ బస్సులతో పాటు 444 అదనపు బస్సులను నడిపించగా ప్రయాణికుల రద్దీని బట్టి మళ్లీ అదనంగా 124 బస్సులను ఏర్పాటు చేసింది. దీంతో సాధారణ, ప్రత్యేక బస్సులతో కలిపి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు డిపోల పరిధిలో రోజువారి ఆదాయంతో పాటు అదనంగా రూ.15లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

2.30లక్షల కిలోమీటర్లు..

ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల నుంచి 568 బస్సులను ఈనెల 9నుంచి 20వరకు నడపగా, ఈ బస్సులు 2.30లక్షల కిలోమీటర్లు ప్రయాణించాయి. ప్రత్యేక బస్సుల్లో మొత్తం లక్ష మందికి పైగా ప్రయాణించగా, వీరిలో మహాలక్ష్మి ప్రయాణికులు సుమారు 60 వేలకు మంది ఉన్నారు. ప్రత్యేక బస్సుల ద్వారా ఆర్టీసీకి రూ.1.73 కోట్ల ఆదాయం వచ్చింది. నిజామాబాద్‌-జేబీఎస్‌, జేబీఎస్‌-నిజామాబాద్‌, ఆర్మూర్‌-జేబీఎస్‌, జేబీఎస్‌-ఆర్మూర్‌, కామారెడ్డి-జేబీఎస్‌, జేబీఎస్‌-కామారెడ్డి, నిజామాబాద్‌-వరంగల్‌, కరీంనగర్‌, వరంగల్‌, కరీంనగర్‌-నిజామాబాద్‌, బాన్సువాడ-మెదక్‌, మెదక్‌-బాన్సువాడలకు ఈ బస్సులను నడిపించారు. అలాగే విజయవాడకు సైతం బస్సులను నడిపించారు. దీంతోపాటు ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని 1056 గ్రామాలకు బస్సులు యథావిధిగా నడిపించారు.

అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం..

సంక్రాంతికి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల చర్యలు చేపట్టాం. ముందస్తుగా అదనపు బస్సులను ఏర్పాటు చేశాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అదనపు బస్సుల కంటే ఎక్కువగా నడిపించాం. సర్వీసులను ప్రణాళికతోపాటు రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులు, సిబ్బందిని నియమించాం. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. మొత్తం 444అదనపు సర్వీసులకు మరో 128 బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాం.

– సరస్వతి, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం, నిజామాబాద్‌

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్‌

నిజామాబాద్‌అర్బన్‌: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని డీఈవో అశోక్‌ అన్నారు. నగరంలోని కోటగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం కౌన్సిల్‌ ఫర్‌ గ్రీన్‌ రెవల్యూషన్‌ (థీ ఎన్విరాన్మెంటల్‌ ఆర్గనైజేషన్‌) డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాలస్థాయి యంగ్‌ ఎర్త్‌ లీడర్స్‌ ప్రోగ్రామ్‌ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థుల చొప్పున 10 మంది విద్యార్థులతో స్కూల్‌ ఎర్త్‌ లీడర్స్‌ను ఎన్నుకున్నారు. అనంతరం సంస్థ ప్రతినిధులు అనుదీప్‌, జ్ఞానేశ్వర్‌ మాట్లాడుతూ.. పర్యావరణం పట్ల నేటి బాలల బాధ్యత వాటి సంరక్షణ మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. డీఈవో చేతుల మీదుగా ఎర్త్‌ లీడర్స్‌ క్లబ్‌ విద్యార్థులకు బ్యాడ్జెస్‌ ప్రదానం చేశారు. హెచ్‌ఎం మల్లేశం, జిల్లా సైన్స్‌ అధికారి గంగా కిషన్‌, శ్రీనివాసరావు, డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య, ఫిజికల్‌ డైరెక్టర్‌ మాధవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రావిచెట్టుకు చీరతో సన్మానం



రావిచెట్టును చీరతో సత్కరిస్తున్న సొసైటీ ఫర్‌ గ్రీన్‌ రెవల్యూషన్‌ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం సొసైటీ ఫర్‌ గ్రీన్‌ రెవల్యూషన్‌ సంస్థ ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాలుష్యం వల్ల పర్యావరణంలో వచ్చే మార్పులు, భవిష్యత్‌ తరాల వారికి కలిగే నష్టాలను వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉన్న రావి చెట్టును భూమాతగా గుర్తించి చీరతో సన్మానించారు. సంస్థ తెలంగాణ ప్రాంత డైరెక్టర్‌ అనుదీప్‌, కోటి మొక్కల పెంపకం లక్ష్యంగా చేసుకున్న పర్యావరణ వేత్త జ్ఞానేశ్వర్‌ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అనేది అందరి బాధ్యత అని, భవిష్యత్‌ తరాలకు ప్లాస్టిక్‌ రహిత సమాజాన్ని అందించడం ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. హెచ్‌ఎం నరేష్‌, ఉపాధ్యాయులు ఉమా, శశి పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగులకు అందని జీతాలు

- మూడు నెలలుగా ఎదురుచూపులు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వైనం



ఉపాధిహామీ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): గ్రామీణాభివృద్ధి శాఖలో ఉపాధిహామీ విభాగంలో పని చేస్తున్న చిరుద్యోగులకు వేతనాలు కరువయ్యాయి. నెలనెలా జీతాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాల పోషణ కష్టంగా మారిందని ఉద్యోగులు వాపోతున్నారు. అప్పులు చేసి ఇంటిని నెట్టుకురావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 452 మంది..

ఉపాధిహామీ విభాగంలో జిల్లా వ్యాప్తంగా 452 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో ఏపీవోలు, టెక్నికల్‌ అసిస్టెంట్లు, ఈసీలు, కంప్యూటర్‌ ఆపరేటర్లు, ఇతర ఉద్యోగులు, ఫీల్డ్‌ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రతీ నెలా ఉద్యోగుల ఎఫ్‌టీవో జనరేట్‌ చేసి పంపుతున్నా గతేడాది నవంబర్‌ నుంచి జీతాలు వారి బ్యాంకు ఖాతాల్లో పడడం లేదు. రాష్ట్ర శాఖలో బడ్జెట్‌ లేకపోవడంతోనే వేతనాలు ఆలస్యం అవుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. వేతనాల ఆలస్యంపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్‌ను 'సాక్షి' వివరణ కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వేతనాలు వచ్చేలా చూస్తానని తెలిపారు.

ప్రతినెలా ఇస్తే బాగుంటుంది



వేతనాలు ఆలస్యంగా రావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో కుటుంబాల పోషణ కష్టంగా మారుతోంది. విధులకు న్యాయం చేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులకు వేతనాలు ఆపకుండా ప్రతీ నెలా ఇస్తే బాగుంటుంది.

–విజయ్‌, అకౌంట్స్‌ అసిస్టెంట్‌

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి యాసంగిలో ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 4వేల క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు నీటి విడుదల జరుగుతుంది. అలాగే లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్ట్‌ ద్వారా 450 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్‌ ద్వారా 135 క్యూసెక్కులు, ఎత్తిపోతల పథకాల ద్వారా 312 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 397 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు తాగు నీటి అవసరాల కోసం పోతుంది. దీంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం క్రమంగా తగ్గుతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1083.70(55.6 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు. గతేడాది ఇదే రోజున ప్రాజెక్ట్‌లో 50 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

కవిత ఫొటోల మార్ఫింగ్‌పై చర్యలు తీసుకోవాలి



ఇన్‌చార్జి సీపీ సింధుశర్మకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్‌ ప్రతినిధులు

నిజామాబాద్‌అర్బన్‌: ఎమ్మెల్సీ కవిత ఫొటోలను మార్ఫింగ్‌ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు మంగళవారం నగర మేయర్‌ నీతూ కిరణ్‌, బీఆర్‌ఎస్‌ మహిళా ప్రతినిధులు కలిసి ఇన్‌చార్జి సీపీ సింధుశర్మకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు నగరంలోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మేయర్‌ మాట్లాడారు. కవిత కృషితోనే పసుపుబోర్డు ఏర్పాటు అయిందన్నారు. కొద్ది మంది నాయకులు వారి స్థాయిని మరిచి ఎమ్మెల్సీ కవితను విమర్శిస్తున్నారన్నారు. పసుపు బోర్డు కోసం ఎన్నో సార్లు ప్రధానమంత్రిని, ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి విన్నవించిందన్నారు. పార్లమెంట్‌లో ప్రైవేట్‌ బిల్లును ప్రవేశపెట్టి పసుపుబోర్డు అంశాన్ని చర్చించిందన్నారు. ఎమ్మెల్సీ కవితపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఎంపీగా గెలిస్తే ఐదు రోజుల్లో అర్వింద్‌ పసుపుబోర్డు తెస్తానని చెప్పి ఐదు సంవత్సరాల తరువాత తీసుకవచ్చాడని విమర్శించారు. పార్టీ ప్రతినిధులు సుమనరెడ్డి, విశాలిని రెడ్డి, సిర్ప సువర్ణ, విజయలక్ష్మి, గంగామణి, నాయకులు పంచరెడ్డి అనిత ఉన్నారు.

మోసాలకు గురికావొద్దు

ఖలీల్‌వాడి: క్రిప్టో కరెన్సీ, ఆగ్రో గార్మెంట్స్‌, హెర్బల్‌, హెల్త్‌, గృహోపకరణాల ఉత్పత్తులను విక్రయించే ముసుగులో సైబర్‌ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వాటిని గ్రహించి జాగ్రత్తపడాలని సైబర్‌ ఏసీపీ వెంకటేశ్వర్‌ మంగళవారం పేర్కొన్నారు. మొదటగా కొంత సొమ్మును ఆశగా చూపి తర్వాత మోసం చేస్తారని ప్రజలు ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్‌ నేరానికి గురైతే వెంటనే పోలీస్‌స్టేషన్‌, 1930 హెల్ప్‌ లైన్‌ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి



మద్నూర్‌(జుక్కల్‌): రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని నేషనల్‌ హైవే ఇన్సిడెంట్స్‌ మేనేజర్‌ సౌరభ్‌ ప్రతాప్‌సింగ్‌ సూచించారు. మేనూర్‌లో జాతీయ రహదారి–161లో గల మోడల్‌ స్కూల్‌, కళాశాల వద్ద మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు తప్పకుండా హెల్మెట్‌ పెట్టుకోవాలన్నారు. గ్రామస్తులు సర్వీస్‌ రోడ్లను ఉపయోగించుకోవాలని సర్వీస్‌ రోడ్డులో ప్రయాణించేటప్పుడు గంటకి 40 కిలోమీటర్ల వేగంలోనే వెళ్లాలన్నారు.

రేపు ఉద్యోగ మేళా

నిజామాబాద్‌ నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్‌ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 23న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి బి పి మధుసూదన్‌ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో ముత్తూట్‌ ఫైనాన్స్‌ కంపెనీలో ఖాళీలను భర్తీ చేస్తారన్నారు.ఇంటర్మీడియట్‌, ఏదైనా డిగ్రీ పాసైన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద జరిగే ఉద్యోగ మేళాకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9948748428, 6305743423, 77022 59070 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్‌

నిజాయితీ చాటిన ట్రాఫిక్‌ పోలీసులు



ఖలీల్‌వాడి: బంగారం పోగొట్టుకున్న వ్యక్తికి అతడి ఆచూకీ కనుగొని, పోగొట్టుకున్న బంగారం అందించి ట్రాఫిక్‌ పోలీసులు నిజాయితీని చాటుకున్నారు. నగరంలోని ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ వద్ద సోమవారం డ్రంకన్‌డ్రైవ్‌లో వాహనం పట్టుబడటంతో జమనతు ఉండేందుకు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన జనార్దన్‌ మూడు గ్రాముల బంగారం కిందపడిపోయినట్లు ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ తెలిపారు. దీని విలువ రూ.25 వేలు ఉంటుందన్నారు. ఆ బంగారం ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌ ఎండీ ఫైజుద్దీన్‌కి దొరకగా, సీసీ కెమెరాలలో బాధితుడిని గుర్తించి, మంగళవారం జనార్దన్‌కు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఫైజుద్దీన్‌ను ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌, సిబ్బంది అభినందించారు.

సీఈఐఆర్‌ ద్వారా 71 సెల్‌ఫోన్ల రికవరీ



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని నిజామాబాద్‌, ఆర్మూర్‌, బోధన్‌ డివిజన్‌ పరిధిలో గతంలో పలువురు బాధితులు సెల్‌ఫోన్‌లు పోగొట్టుకోగా, సీఈఐఆర్‌ ద్వారా 71 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు డీసీపీ(అడ్మిన్‌)బస్వారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌ కమిషనరేట్‌లో మంగళవారం సెల్‌ఫోన్‌లను బాధితులకు అందించినట్లు ఆయన వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వారి సెల్‌ఫోన్లను వాడడంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్‌ నేరాలపై కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా వారి సెల్‌ఫోన్‌ పోతే సీఈఐఆర్‌ పోర్టల్‌లో పూర్తి వివరాలను పొందుపర్చాలన్నారు. పోయిన సెల్‌ఫోన్‌ను త్వరగా పట్టుకుని బాధితులకు అందిస్తామన్నారు. సెల్‌ఫోన్లను అందించేందుకు కృషి చేసిన కానిస్టేబుళ్లు మాన్‌సింగ్‌, అనుషా, సుష్మలకు ప్రసంశపత్రాలను అందజేశారు.

బోధన్‌ టౌన్‌కు రెండో స్థానం



బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలో జనవరిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించడంలో బోధన్‌ పట్టణ పోలీస్‌ స్టేషన్‌ రెండోస్థానం దక్కించుకుంది. ఈసందర్భంగా పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మాన్‌సింగ్‌ జిల్లా ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జనవరిలో 38ఫోన్లను రికవరీ చేసినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు.

కొడుక్కి తలకొరివి పెట్టిన తల్లి



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా అతడి తల్లి తలకొరివి పట్టి, అంత్యక్రియలు నిర్వహించింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండకు చెందిన గుండా రాజేశ్‌(33) నిజామాబాద్‌ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో ల్యాబ్‌ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ధర్పల్లి నుంచి దోమకొండకు వస్తుండగా, రామారెడ్డి శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మంగళవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించగా తల్లి కుమారుడికి తలకొరివి పెట్టింది. మృతుడికి భార్య పద్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హోంగార్డు ఆత్మహత్యాయత్నం

- కాపాడిన రైల్వే పోలీసులు



హోంగార్డును కాపాడిన రైల్వేపోలీసులు


ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌లోని రైల్వే పట్టాలపై హోంగార్డు ఆత్మహత్యకు యత్నించినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. మంగళవారం ఉదయం 5.55గం.కు రైల్వే స్టేషన్‌ పట్టాలపై ఒక వ్యక్తి సూసైడ్‌ చేసుకుంటున్నాడని డయల్‌ 100కు కాల్‌ వచ్చింది. దీంతో వారు వెంటనే రైల్వే పోలీస్‌స్టేషన్‌లోని పోలీసు సిబ్బంది కుబేరుడు, రాములను తనిఖీకి పంపించారు. ప్లాట్‌ఫాం–3 పట్టాలపై ఒక వ్యక్తి పట్టాలపై కూర్చొని ఉండగా అతడిని పట్టుకుని వచ్చి రైల్వేస్టేషన్‌లో విచారించారు. అతడు తన పేరు తాటికొండ నర్సయ్య అని హోంగార్డుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తన భార్య, అత్తమామల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు తెలిపారు. అనంతరం అతడిని నాలుగోటౌన్‌ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

పాత నాణాలకు రూ.లక్షలు ఇస్తామంటూ మోసం

బాన్సువాడ: పాత నాణాలు ఇస్తే రూ.99లక్షలు ఇస్తామంటూ సైబర్‌ నేరగాళ్లు చేసిన మోసానికి ఓ వ్యక్తి మోసపోయాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. బీర్కూర్‌ గ్రామానికి చెందిన నర్రె గంగారాం బతుకు దెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా ఇటీవల బీర్కూర్‌కు వచ్చిన ఆయనకు ఇన్‌స్టాగామ్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. పాత నాణేలు ఇస్తే రూ.99 లక్షలు ఇస్తామని చెప్పడంతో వెంటనే అందులో ఉన్న నంబర్‌కు గంగారాం ఫోన్‌ చేశాడు. రూపాయి, ఐదు, పది, 25, 50 పైసల నాణేలతో పాటు రూ.20, రూ.100, రూ.200 నోట్లు తీసుకుని రూ.99 లక్షలు ఇస్తామని చెప్పడంతో గంగారాం నమ్మాడు. ఇందుకు కొంత ఖర్చు అవుతుందని తెలపడంతో గంగారాం విడతల వారీగా రూ.1.80లక్షలు ఓ డిజిటల్‌ యాప్‌ ద్వారా సైబర్‌ నేరగాళ్లకు చెల్లించాడు. ఈ నెల 17న మళ్లీ నేరగాళ్లు ఫోన్‌ చేసి రూ.99 లక్షలు ఇవ్వాలంటే ఎయిర్‌పోర్టుకు కారు, రక్షణ సిబ్బందికి, జీఎస్టీకి కలపి రూ.లక్ష ఖర్చు అవుతుందని ఆ నగదు పంపించాలని చెప్పారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన గంగారాం బీర్కూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న బైక్‌

- బాలుడి మృతి.. ముగ్గురికి గాయాలు



టిల్లు (ఫైల్‌)

ఇందల్వాయి: మండలంలోని కొటాల్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం మధ్యాహ్నం ఓ బైక్‌ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మూడేళ్ల బాలుడు మృతిచెందగా ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. మాచారెడ్డి మండలం రాజంపేట్‌ గ్రామానికి చెందిన రజనీకాంత్‌, గౌతమి దంపతులకు ఇద్దరు కుమారులు టిల్లు, రియాన్ష్‌ ఉన్నారు. మంగళవారం వారంతా బైక్‌పై డొంకల్‌ గ్రామానికి వచ్చి, వారి బంధువు గాజ భూమయ్య అంత్యక్రియలకు హాజరయ్యారు. అనంతరం వారు బైక్‌పై రాజంపేట్‌ వెళుతుండగా కొటాల్‌పల్లి గ్రామ శివారులో బైక్‌ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈఘటనలో టిల్లు(3)కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగితా ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదంపై స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు బాలుడి మేనమామ గణేష్‌ తెలిపారు.

మాజీ విండో చైర్మన్‌ ఆత్మహత్య



సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం మాజీ విండో చైర్మన్‌ జనగామ ప్రభాకర్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన జనగామ ప్రభాకర్‌ రెడ్డి(66) ఇటీవల తన కుమారుడికి వివాహం జరిపించాడు. గత కొన్ని రోజులుగా కుటుంబంలో తగాదాలు రావడంతో కోడలు కేసు వేసింది. ప్రస్తుతం కేసు కొనసాగుతుంది. దీంతో ప్రభాకర్‌ రెడ్డి మనస్తాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు ప్రభాకర్‌ రెడ్డి గతంలో టీడీపీ మండలాధ్యక్షుడిగా, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌గా, సింగిల్‌ విండో చైర్మన్‌, సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. రెండు సార్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేశారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రంజీత్‌ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ ఆయిల్‌, కాపర్‌ చోరీ



రుద్రూర్‌: పోతంగల్‌ మండలం కొడిచర్ల శివారులోని ఎత్తిపోతల పథకం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఆయిల్‌, కాపర్‌ కాయిల్స్‌ను దొంగిలించినట్లు ఎస్సై సందీప్‌ మంగళవారం తెలిపారు. లిఫ్ట్‌ ఇరిగేషన్‌ అసిస్టెంట్‌ ఇంజినీర్‌ యోగేష్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెయింట్‌ వేస్తూ కింద పడి ఒకరి మృతి

బాన్సువాడ: తాడ్కోల్‌ శివారులోని డబుల్‌ బెడ్‌రూం కాలనీలో మంగళవారం ఓ భవనంపై పెయింట్‌ వేస్తూ ప్రమాదవశాత్తు కింద పడి ఒకరు మృతిచెందారు. సీఐ అశోక్‌ తెలిపిన వివరాలు ఇలా.. డబుల్‌ బెడ్‌రూం కాలనీలో నివాసముంటున్న నవీన్‌గౌడ్‌ తన ఇంటికి పెయింటింగ్‌ పనులను శాదుల్లా (45)కు అప్పగించాడు. దీంతో అతడు కర్రలు కట్టుకుని పెయింట్‌ వేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో శాదుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన అన్నారు.